



చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

సైన్స్, చరిత్రకు స్థానం లేని విద్యావిధానం

ఎన్ఎపిని వ్యతిరేకించాలి : ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నూతన జాతీయ విద్యావిధానంలో సైన్స్ చరిత్రకు స్థానం లేకుండా విద్యా విధానాన్ని రూపొందించడం బాధాకరమని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. జాతీయ విద్యా విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కర్నూలు టౌన్ మోడల్ హై స్కూల్స్ గ్రౌండ్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో 'చరిత్ర సైన్స్‌కు స్థానంలేని విద్యా విధానం ప్రయాణం ఎటు' అంశంపై శుక్రవారం రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కెఎస్.లక్ష్మణరావు ముఖ్యోపన్యాసం చేశారు. భారత దేశంలో ఇప్పటికే విద్య 50 శాతం ప్రైవేటీకరణ జరిగిందని, దీనివల్ల పేద మధ్యతరగతి విద్యార్థులు నాణ్యమైన విద్య అందుకోలేకపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా విధానాన్ని రాష్ట్రాలతో సంప్రదించకుండా ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. నూతన విద్యా విధానంతో కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, మతతత్వీకరణ వైపు అడుగులు వేసిందన్నారు. పెద్ద నగరాలలో చిన్న పట్టణాలలో గ్రామీణ ప్రాంతాలలో అటవి ప్రాంతాలలో నివసిస్తున్న విద్యార్థులందరూ ఒకే రకమైన విద్యను అవలంబించాలంటే అన్నిచోట్ల ఒకే రకమైన అవకాశాలు ఉండాలన్నారు. మతతత్వీకరణ వల్ల విద్యలో ఆశాస్త్రీయమైన అంశాలను జోడిస్తున్నారన్నారు. ఐక్యమత్యంగా కుల మతాలకు అతీతంగా చదువుకోవాల్సిన పిల్లల మధ్య వైరుధ్యాలను పెంచే కుట్ర జరుగుతుందని తెలిపారు. భారతదేశంలోని మొట్టమొదటి విద్యామంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం అజాద్ భారతదేశంలో లౌకిక రాజ్యం కోసం కృషిచేసిన మహనీయుడి చరిత్రని తొలగించడం సరైనది కాదన్నారు. 11వ తరగతిలోని జమ్మూ కాశ్మీర్ విలీనం అనే పాఠాన్ని తొలగించారని, ఇది ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఇండియాలో విలీనం అయిందన్నారు. అందుకే కొన్ని ప్రత్యేక హక్కులు ఇచ్చారన్నారు. జాతిపిత జాతీయ స్వాతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మా గాంధీనీ గాడ్సేహత్య చేయడాన్ని, ఆర్ఎస్ఎస్ నిషేధాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించారన్నారు. 2002 లో గుజరాత్ లో గోద్ర సంఘటన జరిగినప్పుడు గుజరాత్లో ముస్లింలపై ఊచకోత చేసి రెండు వేల మంది దారుణంగా చంపబడ్డారు అది పాఠంశాల్లో ఉంది దాన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. దాదాపు వందేళ్ల మతసామరస్యాన్ని కాపాడిన మొగలుల చరిత్రను, భారతదేశంలోని రైతాంగ పోరాటాలు ఆదివాసుల పోరాటాలు ముఖ్యమైన ఉద్యమాలకు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగించారన్నారు. ఉద్దేశపూర్వకంగా చరిత్రను చెరిపేయాలి మాయం చేసిముస్లింలపై విద్వేషాలు వెదజల్లాలి, మత ఉన్మాదాన్ని భారతదేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టాలి అనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం దుర్మార్గానికి ఒడిగట్టిందని తెలిపారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ హై స్కూల్స్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో మొదటి ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మేమొంటోలను కెఎస్. లక్ష్మణరావు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్. శేషయ్య, రంగస్వామి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, యుటిఎఫ్ జిల్లా నాయకులు హేమంత్, నవీన్ పాటి, యెహోషువ, మారెప్ప, తిమ్మన్న మురారి మూర్తి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు బతకన్నా, నోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణ రావు



సదస్సుకు హాజరైన నాయకులు, ప్రజలు, అభిమానులు

పథకాల అమలులో వాలంటీర్లు కీలకం

- సేవా వజ్ర అవార్డుకు 38, సేవారత్నకు 169 మంది

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఉత్తమ సేవలు అందించిన గ్రామ, వార్డు వాలంటీర్లను మూడు విభాగాల్లో ఎంపిక చేయడంతో పాటు నగదు ప్రోత్సాహం అందించే కార్యక్రమాన్ని విజయవాడ నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి డాక్టర్ జె.సుధాకర్, నగర మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, మున్సిపల్ కమీషనర్ భార్గవ్ తేజ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ, వారు చేసిన ఉత్తమ సేవలను గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వారు చేసిన సేవలకు సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర లాంటి మూడు విభాగాలుగా విభజించామన్నారు. సేవా మిత్రలకు 10వేల నగదుతో పాటు సర్టిఫికేట్, శాలువ, బ్యాడ్జ్, సేవా రత్నలకు రూ.20వేల నగదుతో పాటు సర్టిఫికేట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్, సేవా వజ్రలకు రూ.30వేల నగదుతో పాటు సర్టిఫికేట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ వారి పని తీరు ఆధారంగా ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాల్లో భాగంగా ముఖ్యంగా పెన్షన్ అంటే వాలంటీర్ గుర్తొచ్చే విధంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. సచివాలయ వ్యవస్థకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కేవలం పెన్షన్ మాత్రమే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని ప్రజలకు హక్కుగా ప్రజల వద్దకు తీసుకెళ్లి వీరు అర్హులా కాదా అని గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా ఒక వారధిలా వాలంటీర్లు ఒక ప్రత్యేక భూమికను పోషిస్తున్నారన్నారు. ఇదే రకమైన సేవా స్ఫూర్తితో ఇంకా ముమ్ముందు పని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందజేయాలన్నారు. విద్య, వైద్యం, ప్రతి ఒక్క అభివద్ధి కార్యక్రమం గురించి వాలంటీర్లు అడిగే పరిస్థితి ఉందన్నారు. వివిధ విభాగాల్లో ఎంపికైన వాలంటీర్లు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సేవా వజ్ర క్రింద – 38 మంది, సేవా రత్న కింద – 160 మంది, సేవా మిత్ర కింద – 8963 మంది ఎంపిక అయ్యారు. అనంతరం కలెక్టర్, ప్రజాప్రతినిధులు వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా 9161 మంది వాలంటీర్లకు మొత్తం రూ.9.39 కోట్ల మెగా చెక్కును అందజేశారు.

ప్రయారిటీ భవనాలు సెప్టెంబర్ 15 నాటికి పూర్తి

రూఫ్ లెవెల్‌లో ఉన్న ప్రయారిటీ భవనాల నిర్మాణాల పనులను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రయారిటీ భవనాల నిర్మాణాల అంశంపై పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మంగళవారం నుండి ప్రతి వారం ప్రాయారిటీ భవనాల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. నాడు నేడు సెకండ్ ఫేజ్ కింద అన్ని పాఠశాలల్లో జరుగుతున్న విద్యుత్, తాగు నీరు, పెయింటింగ్, టాయిలెట్స్ విత్ రన్నింగ్ వాటర్ తదితర మౌలిక సదుపాయాల పనులను మే 31 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డ్వామా పిడి అమర్నాథ్‌రెడ్డి, పాల్గొన్నారు.

సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం



సుందరయ్య భవన్‌లో నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, రాముడు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆదర్శ కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా కర్నూలు సుందరయ్య భవన్‌లో సుందరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆదర్శ కమ్యూనిస్టు ఉద్యమనేత కష్టజీవుల ఆశాజ్యోతి సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఎం జిల్లా కార్యాలయంలో సుందరయ్య విగ్రహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.నారాయణ, నగర కార్యదర్శి టి.రాముడు, ఎస్.సుభాన్‌లు, ఎన్.అలివేలు, అరుణమ్మ, పూలలు వేసి నివాళ్లు అర్పించారు. టి.రాముడు అధ్యక్షతన జరిగిన సభలో కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సుందరయ్య చిన్న వయసులోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని తర్వాత కాలంలో కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో చేరారని తెలిపారు. ఆయనకు నివాళులర్పించడం వరకే పరిమితం కాకుండా ఆయన ఆశయాన్ని సాధించడం కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడంతో పాటు సమాజ మార్పునకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తమ సొంత గ్రామంలోని అంటరానితనానికి వ్యతిరేకంగా, వ్యవసాయ కూలీలకు పనికితగిన కూలీలు ఇవ్వాలని పోరాటం చేశారన్నారు. పేద ప్రజలకు నిత్యవసర వస్తువులను చౌకగా అందజేయడంతో పాటు తెలంగాణ ప్రాంతంలో ప్రజల విముక్తికోసం, నైజాం నవాబు నిరక్షత్వానికి వ్యతిరేకంగా విప్లవ పోరాటానికి సారథ్యం వహించారన్నారు. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడంలో కీలకపాత్ర వహించిన మహా నాయకుడు సుందరయ్య అన్నారు. రాజ్యసభ సభ్యులుగా, శాసనసభ సభ్యులుగా ఉన్న సందర్భంలో ప్రజా సమస్యలను వివరంగా పాలకలకు దృష్టికి తేవడంతో పాటు బయట ప్రజానీకాన్ని సమీకరించి అనేక పోరాటాలు చేయడంలో నిరంతర కృషి చేశారన్నారు. ఆయన ఆశయం కోసం పార్టీ ప్రజా సంఘాల కార్యకర్తలందరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారులు, హమాలి యూనియన్ నాయకులు పార్టీ ,ప్రజాసంఘల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డు సిటీలో : సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సూర్జీత్ భవన్ నందు శుక్రవారం కె.రాజగోపాల్ అధ్యక్షతన సుందరయ్య 38వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ కార్మిక కర్షక, పీడిత ప్రజల కోసం ప్రజా ఉద్యమాలను సుందరయ్య నిర్మించారని కొనియాడారు. సిపిఎం ఓల్డ్ సీనియర్ నాయకులు కెవి. సుబ్బయ్య, సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.విజయ్, ఎస్ఎండి షరీఫ్, కె.రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్, సివిల్ సప్లయ్ హమాలి రాష్ట్ర నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డుసిటీలో నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి, తదితరులు

లక్ష్మీనగర్‌లో : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తి ప్రదాత పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కర్నూలు చిల్డ్రన్ క్లబ్ కన్వీనర్ ఉమాదేవి అన్నారు. లక్ష్మి నగర్ చిల్డ్రన్ క్లబ్ సమ్మర్ క్యాంప్‌లో సుందరయ్య వర్ధంతిని బాలబాలికలు ఘనంగా నిర్వహించారు.

కర్నూలు హాస్పిటల్ : 32 వార్డు ముజఫర్ నగర్ గ్రంథాలయం ఆవరణలో కెవిపియస్ ఆధ్వర్యంలో సుందరయ్య 38 వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నగర నాయకులు సుధాకరప్ప , తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: తుగ్గలిలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘంమండల కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పత్తికొండ : పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి ప్రజా సంఘ నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు.

ఉలిందకొండలో: ఉలిందకొండ నరసింహయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శిర్గ సభ్యులు జి.రామకృష్ణ, నాయకులు మధు, రామాంజనేయులు, అంజి , మారెప్ప సుందరయ్యకు నివాళ్లు అర్పించారు.

కోడుమూరు: కోడుమూరులో సిఐటియు మండల కార్యదర్శి వీరన్న అధ్యక్షతన సిపిఎం మండల కార్యదర్శి గఫూర్ మియా, కె. రాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గూడూరులో జె.మోహన్ నాయకత్వంలో సుందరయ్యకు నివాళ్లు అర్పించారు.



హోండాషైన్ 100సిసి వెహికిల్‌ను ప్రారంభిస్తున్న కెవి.సుబ్బారెడ్డి

హోండా షైన్ 100 సిసి వెహికిల్ లాంచింగ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని శౌర్య హోండా షో రూంలో హోండా షైన్ 100 సిసిని చైర్మన్ కెవి విశ్వం మోహన్ రెడ్డి, కెవి సుబ్బారెడ్డి విద్య సంస్థల అధినేత కెవి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సంద్భంగా శౌర్యహోండా చైర్మన్ కెవి.విశ్వం మోహన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ వినియోగదారులే లక్ష్యంగా ఈ కొత్త బైక్‌ను లాంచ్ చేశామన్నారు. ఈ బైక్ 97.2సిసి ఎయిర్–కూల్డ్, సింగిల్ సిలిండర్ ఇంజన్ ద్వారా శక్తిని ఇస్తుందన్నారు. ఈ బైక్‌లు బ్లాక్ విత్ రెడ్ స్ట్రిప్స్, బ్లాక్ విత్ బ్లూ స్ట్రిప్స్, బ్లాక్ విత్ గ్రీన్ స్ట్రిప్స్, బ్లాక్ విత్ గోల్డ్ స్ట్రిప్స్, బ్లాక్ విత్ గ్రే స్ట్రిప్స్ వంటి ఐదు కలర్స్‌లో లభించనున్నాయన్నారు. ఈ బైక్ లీటర్‌కి 65 కిలోమీటర్లకు పైగా మైలేజ్ ఇవ్వనుందన్నారు. కర్నూలు నగరంలో శౌర్య హోండా షో రూం లో మాత్రమే షైన్ 100 సిసి లభిస్తుందని తెలిపారు. కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ హోండా షైన్ 100 సిసి అత్యంత సరసమైన ధరలో లభించడమే కాకుండా మెరుగైన ఇంధన సామర్థ్యంతో కలదన్నారు. షైన్ మోడల్‌పై ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. షైన్ బ్రాండ్ మరింత మందికి చేరువ కావడానికి 100 సిసి విభాగంలో కూడా దీన్ని విడుదల చేశామన్నారు. సరసమైన ధరలో దీన్ని అందించడం ద్వారా వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంచుకుంటామన్నారు.

లారీ ఓనర్లను డ్రైవర్లను ఆదుకోవాలి



ఆర్‌టిఓ కార్యలయాలనికి ప్రదర్శనగా వెళ్తున్న లారీ యజమానులు, పిపిఎస్

ఆర్‌టిఓ కార్యాలయాన్ని ముట్టడించిన పిపిఎస్, లారీ ఓనర్స్ సంఘాలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

రవాణా రంగంపై పెంచిన వివిధ పన్నుల భారాలను ఉపరసంహరించుకొని ప్రభుత్వం లారీ ఓనర్స్ కం డ్రైవర్స్ ను ఆదుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరం నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు పెద్ద సంఖ్యలో లారీ ఓనర్లు డ్రైవర్లు తమ లారీలతో ప్రదర్శన చేశారు. ఆర్‌టిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిటిసి శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ.పుల్లారెడ్డి, లాంగ్ లారీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులు పీ.మినల్లా, సలార్ బాష మాట్లాడుతూ...పక్కరాష్ట్రాల కంటే పెట్రోల్, డీజిల్ తోపాటు, గ్రీన్ టాక్స్, త్రైమాసికం పన్ను పెంచి లారీ ఓనర్ల డ్రైవర్ల నడ్డి విరుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పగ పట్టినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో పుట్టడమే లారీ ఓనర్లు చేసిన తప్పా? రాష్ట్రం వదిలి పోవాలా? అని ప్రశ్నించారు. లక్ష రూపాయలు పెట్టి పాత వాహనం కొని తిప్పుకుంటున్న ఓనర్ కమ్ డ్రైవర్లకు రేషన్ కార్డులు రద్దుచేసి అమ్మ ఒడి ఆరోగ్యశ్రీ లాంటివి వర్తించకుండా చేశారన్నారు. వాహనం చెడిపోయినా, దొంగలు తీసుకెళ్లినా పన్ను చెల్లించాల్సి వస్తుందన్నారు. 2016లో చోరీకి గురైతే పోలీస్ కేసు నమోదు చేసినప్పటికీ ప్రతి ఏటా టాక్స్ చెల్లిస్తూనే ఉన్నామని ఏ అధికారి పట్టించుకోవడంలేదనిలారి యజమాని హఫీస్ అన్నారు. భారాలను తగ్గించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీధర్ స్పందిస్తూ పన్నులు ఎక్కువ ఉన్న విషయం వాస్తవమేనని, దీనివల్ల వాహనాలు కొనుగోలు తగ్గిపోయిందని అంటూ మీరిచ్చిన వినతులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో లోకల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఎ. సామేలు, ఎస్ బాబు, రమణ, మినీ లారీ ఓనర్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మం, వెంకట స్వామి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర బాధితులు ఎ. విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



విలువిద్య క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ


క్రీడలతోనే విద్యార్థులకు ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

క్రీడలతో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. కర్నూలు డిఎస్ఎ స్టేడియంలో విలువిద్య క్రీడాకారులకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ శంకర్ శర్మ, గౌరవ అతిథిగా ఇంటర్నేషనల్ సెపక్ తక్ర క్రీడాకారుడు పవన్ పాల్గొన్నారు. గత 20 రోజులుగా వేసవి విలువిద్య శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు డాక్టర్ శంకర్‌శర్మ బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె. నాగరత్నమయ్య, భరత్, బాలాజీ రెడ్డి, రాజు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలు అభినయ, మనుశ్రీ, కృష్ణప్రియ, అన్విత, నందన, ప్రణవి, నిహాల్, కుషాల్, సాత్విక్, తేజ్‌వేర్, మాన్విత్, గగన్ మొదలైన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

విత్తనాలు ఎరువులపై వర్క్ షాప్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



రైతులకు వ్యవసాయ పరిస్థితులు, విత్తనాలు ఎరువులు పురుగుల మందులపై శుక్రవారం ఉద్యానవన సమావేశ భవనంలో జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మి అధ్యక్షతన కర్నూలు, నంద్యాల జిల్లాల సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు క్వాలిటీ కంట్రోల్‌పై ఒక్క రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు చట్టాలు గురించి అవగాహన పెంచుకొని నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను రైతులకి చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనరేట్ జెడి ఎ.కృపాదాస్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు , పురుగు మందులు సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు , కమిషనరేట్ ఎడిఎలు రాజన్ , సుదర్శన్‌రాజు , మద్దిలేటి , వ్యవసాయ అధికారులు సురేష్ రెడ్డి , మధు , రెండు జిల్లాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని స్థానిక బిర్లా కాంపౌండ్ నందు సాయి వసంత కాంప్లెక్స్ లో విజేత స్టడీ సర్కిల్ లో సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోలి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ అధ్యక్షతన గ్రూప్ 2 నూతన సిలబస్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ ఆంధ్రుల సామాజిక ఆర్థిక చరిత్ర అనే మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సిలబస్‌లో ఏ ఏ పాఠ్యాంశాలు ఏవిధంగా చదవాలి ఎలా అర్థం చేసుకోవాలనే దానిపై నిర్దిష్ట ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ఏపి పుస్తకాలు చదివితే కచ్చితంగా జాబ్ కొట్టవచ్చు అనే అంశాలను తెలిపారు. త్వరలోనే గ్రూప్ 2, డిఎస్‌సి నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉందని, అభ్యర్థులందరూ అకాడమిక్ స్టాండర్డ్ పుస్తకాలను అధ్యయనం చేయడం మంచిదని తెలిపారు. గ్రూప్ టు డిఎస్‌సి ఎస్ఐ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం నిరంతరం శాసనమండలిలోనూ బయట నిరుద్యోగులు చేసే ఉద్యమాల్లో నిరుద్యోగులకు మద్దతుగా నిలుస్తున్నానని తెలిపారు. అనంతరం ఎకనామిక్స్ లెక్చరర్ కళింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుండి డిఎస్‌సి గ్రూప్ 2 నోటిఫికేషన్ రాలేదన్నారు. అసంబంధ సిలబస్ కూడా ప్రవేశపెట్టారని రిలయన్స్ మైన్స్ రెండు పెట్టడం వల్ల కూడా నిరుద్యోగులకు ఇబ్బందిగా ఉంటుందని నిరుద్యోగుల తరపున శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు తీసుకెళ్లాలని కోరారు. విజేత కోచింగ్ సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ గోవిందు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్‌బాష , నాయకులు తిమ్మప్ప దస్తగిరి బాబి ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ మల్లేష్ నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.



ఎపిపిఎస్‌సి గ్రూప్-2 సిలబస్ మోడల్ పేపర్స్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్‌రావు

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై అలసత్వం వద్దు

ప్రజాశక్తి-సి బెళగల్

జగనన్న ఇళ్ళు నిర్మించుకోవడంలో అలసత్వం ఏమాత్రం తగదని మండల ప్రత్యేక అధికారి శ్యామల లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఒక ఇంటికి రూ 1.80 లక్షలు ఇస్తుందని అవీ చాలావని వెలుగు ద్వారా రూ.35 వేలు వడ్డీలేకుండా ఇస్తుందని, నిర్మాణంలో లబ్ధిదారుల జాప్యం ఏమిటని వాపోయారు. ఇప్పటికే చాలా లబ్ధిదారులు రుణాలు తీసుకోని అలసత్వంగా ఉన్నారని, ఇది సరికాదన్నారు. అవసరమైతే బిల్లులు తిరిగి కట్టించుకొని రద్దు చేసి ఇతరులకు ఇస్తామని హెచ్చరించారు.



లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్యామల

మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలి

-ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వైద్యులకు సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రిసెప్షన్‌లో రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి విధుల్లో పూర్తి స్థాయి సిబ్బంది హాజరయ్యారా అని సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం గత వారంలో కలెక్టర్ సృజన ఆదోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేయగా బాత్‌రూములపై అసహనం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. పూర్తిస్థాయిలో ఎప్పటిలోపు పూర్తి చేస్తారని ఆయన కాంట్రాక్టర్‌ను అడగగా పది రోజుల్లోపు పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ ఆదేశించిన సౌచాలయం పనుల పురోగతిపై పరిశీలించారు. సాయంత్రంలోపు పూర్తిస్థాయిలో టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయనకు వివరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- సిఐ ఎరిషావలీ - భారీగా దొరికిన కర్ణాటక టెట్రా ప్యాకెట్లు


అక్రమ మద్యంతో ఉన్న పోలీసులు

ప్రజాశక్తి - కౌతాళం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ ఎరిషావలీ, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా అధికారులు ఉత్తర్వుల మేరకు కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తన సిబ్బంది వీరేష్, నరేంద్ర, హుస్సేన్ బాష, వీరభాస్కర్, రంగన్నతో కలిసి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వల్లూరు గ్రామ శివారులో గల తుంగభద్ర నది ఒడ్డున కోసిగి గ్రామానికి చెందిన తోవి వినోద్ కుమార్, కుప్పగల్ శీను, గోవిందు, నడిగేరి ఊరుకుంద, ఎ.రాజులు కర్ణాటకలోని మాన్వి వైన్ షాపు నుండి కర్ణాటక మద్యం తక్కువ రేటుకు కొనుగోలు చేశారని తెలిపారు. నది ఆవలి వైపు నుంచి ఒక తెప్ప సహాయంతో నది ఈ వైపునకు తెచ్చినట్లు చెప్పారు. రెండు మోటార్ సైకళ్లపై వేసుకొని చుట్టుపక్కల గ్రామాల వారికి అమ్మడానికి వెళ్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న మద్యం బాక్సులను, రెండు మోటార్ సైకళ్లను, 12 సెల్ ఫోన్లు, ఒక తెప్పను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలే వైసిపి గెలుపునకు పునాది

- జడ్‌పిటిసి విరుపాక్షి


అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కలిసిన జడ్‌పిటిసి

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే వైసిపి గెలుపునకు పునాది అవుతాయని ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. శుక్రవారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను వారి కార్యాలయంలో జడ్‌పిటిసి విరుపాక్షి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధిపై, సంక్షేమ పథకాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల కోసం ఇంటి స్థలాలను ప్రభుత్వం అందిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు ఒక్క సెంటు ఏం పనికొస్తుందని, సమాధి కూడా ఆ స్థలంలో కట్టలేమని ఎగతాళి చేస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు ఎప్పుడైనా స్థలాలిచ్చి కట్టించారా అని ప్రశ్నించారు. మాజీ ఎంపిటిసి మల్లికార్జున, వైసిపి నాయకులు నాగప్ప, పెద్దయ్య, జ్ఞాన్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కోసం

రైతులు పేర్లు నమోదు చేసుకోండి : ఎఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అవసరమైన రైతులు పేర్లను నమోదు చేసుకోవాలని ఎఒ జీరా గణేష్ కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌బికెలో ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీ కింద ప్రభుత్వం నుంచి వేరుశనగ విత్తనాలు, ఎరువులు మంజూరయినట్లు తెలిపారు. మండలానికి 50 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 4 క్వింటాళ్ల పిల్లిపెసర, 8 క్వింటాళ్ల జీలుగు కేటాయించినట్లు చెప్పారు. ఎఇఒ నరసింహుడు పాల్గొన్నారు.

భానుడి భగభగలు...



ప్రజాశక్తి - హోళగుంద

భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఉంటే ఉక్కపోతతో, బయటికి వెళ్తే వడదెబ్బకు గురవుతామని భయపడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి 41 డిగ్రీల నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎండలు దంచి కొడుతుండడంతో ముఖ్యమైన పనులను వదులుకోలేక ఎండల బయటికి వెళ్లక తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు. గత మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి మార్చిలోనే ఎండలు అమాంతం పెరిగిపోవడంతో మే, జూన్‌లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఏడాది వర్షాలు కూడా తక్కువగా కురుస్తాయని, రబీ సీజన్ కొంచెం ఆలస్యంగా మొదలవుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. రేపటి నుంచి మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్థికంగా బలపడిన కుటుంబాలు ఎండ తాకిడిని తట్టుకోలేక ఇంటి దగ్గర ఉన్నా గడిచిపోతుంది. రైతులు, చిన్న పరిశ్రమల కార్మికులు, ఉపాధి హామీ పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. చిన్న పరిశ్రమల యాజమాన్యం, ఉపాధి హామీ అధికారులు ఎండ వేడి నుంచి కార్మికులను, కూలీలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తాగునీరు, నీడ అవసరం

వేసవి మొదలైందంటే ప్రతి ఒక్కరికీ తాగునీరు, ఎండ వేడిని తట్టుకోవడానికి నీడ అవసరం. ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించే ప్రదేశంలో కచ్చితంగా నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసి, తాగునీరు అందుబాటులో ఉంచాలి. ప్రయివేట్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖల యాజమాన్యంపై ఉంది.

చలివేంద్రాలు పెరగాలి

గ్రామీణ, మండల, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా జనసంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాల సంఖ్య పెరగాలి. అప్పుడే ఎండలో వచ్చిన వారి దాహార్తిని తీర్చవచ్చు. గతంలో ఆయా శాఖాధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశారు. ఈ ఏడాది కూడా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులు చలివేంద్రాలను అక్కడక్కడ ఏర్పాటు చేసినా ఇంకా అధిక జన సంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బ బారిన పడకుండా వైద్యుల సలహాలు అవసరం

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వైద్యులు ప్రతి గ్రామాన్నీ సందర్శించి ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా సలహాలు, సూచనలు ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు. వడదెబ్బ ఎలా వస్తుంది, వడదెబ్బ లక్షణాలు ఏమిటి, వడదెబ్బకు గురైనప్పుడు ఎలా రక్షించుకోవాలనే కోణంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

22న ధర్నాను జయప్రదం చేయాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవడానికి 22న కలెక్టరేట్ ముందు ధర్నాను చేపడుతున్నట్లు వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాండవగల్లు, కొత్తూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు పూటల పని విధానాన్ని ఎత్తివేయాలని, ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉపాధి కొలతల రేట్లు పెంచాలని, సమ్మర్ అలవెన్స్ 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనుల దగ్గర నీరు, నీడ, మెడికల్ కిట్లు, గడ్డపార సాన పెట్టుకోవడానికి వేతనం కొనసాగించాలని కోరారు. ఉపాధి పనులకు వెళ్లే ప్రతి కూలీకీ పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి 22న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లింగన్న

మేకడోనలో తాగునీటి కష్టాలు

- అధికారులకు పట్టవా..?


తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని మేకడోన గ్రామంలో గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. ఖాళీ బిందెలను కుళాయిల వద్ద పెట్టి గంటల కొద్దీ నిరీక్షించి మహిళలు తాగునీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. మేకడోన గ్రామ సమీపంలోనే ఎల్ఎల్‌సి కాలువ, కొంత దూరంలోనే నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంకు ఉన్నా ప్రజలకు తాగు నీటి కష్టాలు తీరడం లేదు. గ్రామంలో కొన్ని కాలనీలకు తాగునీరు సక్రమంగా అందడం లేదు. తాగునీటి కోసం శ్రీరామాలయం వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మేకడోన గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని మహిళలు కోరారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్లు

- సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు గ్రామాల శివారులో బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని కలుదేవకుంట, చిలుకలడోన, చెట్నిహల్లి గ్రామాల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి 167పై అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు వారి సూచనలు పాటించాలని కోరారు.



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

హమాలీ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మృతి చెందిన సెంట్రల్ వేర్ హౌస్ హమాలీ కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు సీనియర్ నాయకులు బి.మహానంది రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిప్పన్న, పిఎస్.గోపాల్ కోరారు. శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన సెంట్రల్ వేర్ హౌస్‌లో హమాలీ బి.చంద్ర మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని ప్రయివేట్ గోడౌన్లకు తరలించడం ద్వారా సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి లేక అర్థాకలితో దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్‌లో 20 ఏళ్లుగా పని చేస్తున్న హమాలీ కార్మికుడు బి.చంద్ర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సెంట్రల్ వేర్ హౌస్ హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మారెన్న, దానప్ప, హమాలీలు, క్రిష్టప్ప, శంకర్, అంజి, ఉరుకుంద, వీరప్ప, చిన్న ఉరుకుంద, ఈరన్న పాల్గొన్నారు.

విలేకరులపై దాడి దుర్మార్గమైన చర్య

- ఎపియుడబ్ల్యుజె నాయకులు

ప్రజాశక్తి-పెద్దకడబూరు

సిబిఐ వార్త కవరేజ్‌కు వెళ్లిన ఎబిఎన్, హెచ్ఎంటివి రిపోర్టర్స్, కెమెరామెన్‌పై దాడి చేసిన వారిని, దాడికి ప్రోత్సహించిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎపియుడబ్ల్యుజె మంత్రాలయం తాలూకా ఉపాధ్యక్షులు జె.పుల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరులో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ అధికారులు ఎంపీ అవినాష్ రెడ్డిని విచారణకు పిలిచారని తెలిపారు. తన తల్లికి బాగాలేదని, విచారణకు హాజరు కాలేనని న్యాయవాదులకు చెప్పి పులివెందులకు బయల్దేరారని చెప్పారు. అవినాష్ రెడ్డి పులివెందులకు వెళ్తున్నారా..? లేక ఇక్కడే ఉంటున్నారా..? అని తెలుసుకోవడం కోసం సిబిఐ ఆయనను వెంబడించారని తెలిపారు. మీడియా ప్రతినిధులు కూడా అధికారులను ఫాలో అయ్యారని చెప్పారు. ఇది గమనించిన ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఎబిఎన్, హెచ్ఎంటివి వాహనాలను ఆపి వాటిని ధ్వంసం చేయడమే కాకుండా వీడియో జర్నలిస్టుల చేతిలో ఉన్న కెమెరాలు లాక్కొని ధ్వంసం చేయడం దారుణమన్నారు. కెమెరాల ధ్వంసాన్ని అడ్డుకోబోయిన రిపోర్టర్స్‌పైనా, వీడియో జర్నలిస్టులపైనా దాడి చేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి హత్య విషయమై ఏం జరుగుతుంది అనేది తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రిపోర్టర్లు క్షణక్షణం ఈ కేసు దర్యాప్తును ఫాలో చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే అవినాష్‌ను సిబిఐతోపాటు జర్నలిస్టులు కూడా ఫాలో కావడం జరిగిందన్నారు. ఇది జీర్ణించుకోలేక వారిపై దాడి చేయడం బాధాకరమన్నారు. ఇది ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే అన్నారు. మీడియా ప్రతినిధులపైన దాడి చేసిన వారిని, ప్రోత్సహించిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- డిఎంహెచ్ఒ రామగిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫెర్టిలిటీ కేంద్రాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆదిత్య నర్సింగ్ హోమ్‌లోని టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను ఎఆర్‌టి ఇన్‌స్పెక్షన్ టీం మెంబర్స్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసిస్టెండ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ అండ్ సిరోగసీ యాక్ట్-2021 నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయి ఎఆర్‌టి కమిటీ ఆమోదం తెలిపిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామని వివరించారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రేడియాలజీ హెచ్ఒడి డాక్టర్ రాధా రాణి, సోషియాలజిస్ట్ భారతి, డెమో శ్రీనివాసులు, పిసి అండ్ యాక్ట్ జిల్లా మానిటరింగ్ సుమలత, ఆదిత్య నర్సింగ్ హోమ్ డాక్టర్లు శ్రీనివాస్, జానకి, ఆదిత్య ఉన్నారు.


సౌకర్యాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ రామ గిడ్డయ్య

దోమలు వృద్ధి చెందకుండా అవగాహన కల్పించాలి

ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారమూ ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి నీటి నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. పట్టణంలోని యుపిహెచ్‌సి ఇందిరా నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా తనిఖీ చేశారు. వివరాలను ఫ్రైడే డ్రైడే యాప్‌లో క్రమం తప్పకుండా పొందపరచాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించినట్లయితే వివరాలను కంట్రోల్ హైజిన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. యుపిహెచ్‌సి ఇందిరా నగర్ వైద్యాధికారి ఈశ్వర్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశులు ఉన్నారు.


రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం రాజగోపురం నిర్మాణానికి భక్తులు విరాళం ఇచ్చినట్లు దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరానికి చెందిన భక్తుడు నాగేంద్ర ప్రసాద్ రూ.2 లక్షల చెక్కును అందజేశారన్నారు. నంద్యాల పట్టణానికి చెందిన మరో భక్తుడు వీరేష్ కుమార్ తన తల్లిదండ్రుల పేరిట రూ.లక్ష అందజేశారన్నారు.

గడ్డివాములు దగ్ధం

- రూ.లక్ష నష్టం


రౌడూరులో దగ్ధమైన గడ్డివాములు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని రౌడూరు గ్రామంలో నాలుగు గడ్డివాములు దగ్ధమై, సుమారు రూ.లక్ష ఆర్థిక నష్టం సంభవించింది. గ్రామస్తుల వివరాల మేరకు... శుక్రవారం మండు టెండల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గ్రామానికి చెందిన మాల హనుమంతప్ప, మాల ఈరన్నకు చెందిన నాలుగు గడ్డివాములు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై బూడిదయ్యాయి. ఆదోని పట్టణం నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి అదుపు చేసింది.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు డిజిపికి ఆహ్వానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మంత్రాలయం మండలం సూగూరు గ్రామంలో నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే ఐజయ్య సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న బిఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా డిజిపి సునీల్ కుమార్‌ను ఆహ్వానించారు. శుక్రవారం మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య విజయవాడకు వెళ్లి ప్రత్యేక అనుమతి ద్వారా కలిసి ఆహ్వానం పలికారు. స్పందించిన డిజిపి తప్పకుండా వస్తామని తెలిపారు. సూగూరు నాగేష్, వీరేంద్ర, ఎమ్మిగనూరు యువనాయకులు మాల రాజు పాల్గొన్నారు.

దేశానికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం...


ఆదోని వర్ధంతి సభలో మాట్లాడుతున్న వెంకటేశులు


గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న ఆనంద్‌బాబు, నాయకులు


మంత్రాలయంలో నివాళులర్పిస్తున్న అంజిబాబు, నాయకులు



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రామాంజనేయులు

- సుందరయ్య ఆశయాలను నెరవేరుద్దాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు - ఘనంగా సుందరయ్య వర్ధంతి

ప్రజాశక్తి - ఆదోని : దేశానికి కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు, సిపిఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, వీర తెలంగాణ విప్లవ పోరాట రథసారధి, సిపిఎం అగ్ర నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నెరవేర్చాలని కోరారు. శుక్రవారం ఆదోని సుందరయ్య భవన ఆవరణంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేత, సూత్రబద్ధ రాజకీయాలకు మారు పేరు, నీతి నిజాయితీలకు మరో రూపం పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. దేశ రాజకీయాలలో బిజెపిని ఎదురించడంలో కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని ప్రజలు గ్రహించారని, రాబోవు కాలం తమదేనని చెప్పారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న మాట్లాడుతూ... ఉన్మాద ఎజెండాను ఎదుర్కొని, దేశ ఐక్యతను కాపాడుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవాలని కోరారు. విలువలతో కూడిన రాజకీయాల కోసం జరిగే కృషిలో భాగస్వాములు కావాలని తెలిపారు. పట్టణ, మండల నాయకులు తిప్పన్న, ముక్కన్న, వీరారెడ్డి, రామాంజనేయులు, బాష, శ్రీనివాసులు, వెంకటేశులు, నాగరాజు, రామప్ప, తిక్కన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్‌లో కెవిపిఎస్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉపాధ్యక్షులు దండు ఖాజా అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామన్, చంద్రపాల్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, వీరన్న, ఉపాధ్యక్షులు నంది కుమార్, న్యాయవాది వెంకటేష్, డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్షులు మారేసు, ఆటో యూనియన్ నాయకులు వీరన్న గౌడ్, రంగ, సిఐటియు నాయకులు బతకన్న, స్కావెంజర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** పట్టణంలోని తేర్ బజార్ సిపిఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు హనుమంతు, సిఐటియు నాయకులు రాముడు, రైతు సంఘం నాయకులు లక్ష్మి నరసయ్య, అబ్దుల్, విద్యుత్, మున్సిపల్, ఆటో, స్వచ్ఛభారత్, కెవిపిఎస్, విద్యార్థి శాఖల సభ్యులు రమేష్, నాగరాజు, రాజు, రమేష్, రాజు, విజయ్ పాల్గొన్నారు. ఎమ్మిగనూరులోని కెవిపిఎస్ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం, పట్టణ ప్రధాన కార్యదర్శి సుమాల అంతోని, పట్టణ అధ్యక్షులు గుంతప్ప, నందవరం మండలం ప్రధాన కార్యదర్శి కనకవీడు రాజు, కాటికాపర్ల అధ్యక్షులు నాగప్ప, మున్సిపల్ వర్కర్ రాజు, మండల వైస్ ప్రెసిడెంట్ రాజా రమేష్, ఈరన్న గౌడ్, కలుగొట్ల పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఆవరణంలో సిపిఎం మండల కార్యదర్శి జయరాజు ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి అంజిబాబు మాట్లాడారు. సుందరయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సిపిఎం నాయకులు ప్రాణేష్, రమేష్, లక్ష్మన్న, మారెప్ప, ఆంధ్రయ్య పాల్గొన్నారు. **దేవనకొండ** సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు నాగేష్ అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.వీర శేఖర్, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు రంగన్న, కాంతయ్య, బండ్లయ్య, మహేష్, లింగన్న, రంగడు, విజయ్ పాల్గొన్నారు. **ఆలూరు**లోని జ్యోతిబసు భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్,నాగరాజు, శేఖర్, మైనా, షేకున్ బీ, గోవర్ధన్, విఠల్, దేవరాజు, ఈరన్న పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, పరమేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి ఆనందరాజు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు పాల్గొన్నారు. **కౌతాళం**లోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, కెవిపిఎస్ నాయకులు చిన్న మారయ్య, ఉల్లిగయ్య, వెంకోబా పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగరాజు, సీనియర్ నాయకులు సూరన్నలు పూలమాల వేసి నివాళులర్పించారు. హమాలీలు హంపయ్య, నాగప్ప, ఈరన్న, అబ్దుల్లా పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సుందరయ్య భవనం, మండలంలోని జోహరాపురం గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిరుమాన్ దొడ్డి, జోహరాపురం మాజీ సర్పంచులు చిన్న సుంకన్న, మల్లేష్, సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, రైతు సంఘం సీనియర్ నాయకులు మాణిక్యప్ప మాట్లాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, రోగులకు బ్రెడ్లు, పండ్లు, జోహరాపురంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు మహానంది, వెంకట రాముడు, ఈరన్న, రామాంజినేయులు, వెంకటేష్, బలరాం, నౌనేపాటి, లింగన్న, కృష్ణ పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లో సిపిఎం ఆధ్వర్యంలో, పెద్దబొంపల్లి గ్రామంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ముందుగా కోసిగిలో సిపిఎం మండల సీనియర్ నాయకులు నీలకంతప్ప, పెద్దబొంపల్లిలో కెవిపిఎస్ మండల కార్యదర్శి హనుమంతు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, వీరేష్, వెంకటేష్, నాగేంద్ర, రంగ, హనుమంతు, గోపాల్, చిన్నన్న, గుర్రం వీరేష్, ఆదెప్ప, పెద్ద బొంపల్లిలో కెవిపిఎస్ కార్యకర్తలు ఫిలిప్, ముక్కరన్న, ప్రకాష్, దేవపుత్ర, హనుమంతు, యాకూబ్ పాల్గొన్నారు.


దేవనకొండలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆలూరులో నివాళులర్పిస్తున్న నాయకులు


ఆస్పరిలో గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


కౌతాళంలో నివాళులర్పిస్తున్న నాయకులు





వాలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తదితరులు

సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్
- జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ప్రతి కమ్యూనిస్టు ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం బండి ఆత్మకూరు మండల కేంద్రంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి టి.రమేష్ కుమార్ పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశానికి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిజం పునాదులను నిర్మించారని చెప్పారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య 17 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని తన సొంత భూమిని పేదలకు పంచిన అభ్యుదయవాది అని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్, సుబ్బరాయుడు, సిపిఎం సీనియర్ నాయకులు టి.రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో నేటి ప్రజలు, నాయకులు నడవాలని, ఆయన ఆశయాలను సాధించాలని సిపిఎం నాయకులు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నంద్యాలలోని సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, రాజశేఖర్, నాగరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ, పట్టణ సెక్రటేరియట్ సభ్యులు కెఎండి



బండి ఆత్మకూరులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

గౌస్, దర్శనం లక్ష్మణ్, పట్టణ కమిటీ నాయకులు వీర సేన, లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.నాగేశ్వరావు అన్నారు. నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయం ఆవరణలో సుందరయ్య 38వ వర్ధంతి సభ మండల కమిటీ సభ్యుడు పి పకీర్ సాబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరరావు, నాయకులు పి వెంకటేశ్వర్లు మాట్లాడారు. నాయకులు బేస్తరాజు, రంగమ్మ, జయరాణి, హుస్సేనమ్మ, కుమార్, టీ ఓబులేష్, శ్రీనివాసులు, రామిరెడ్డి, ఏసన్న, నరసింహులు, సోడా బిబి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని పట్టణ సిఐ శేషయ్య ప్రారంభించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు.



నంద్యాలలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లులర్పిస్తున్న సిపిఎం నాయకులు

అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్, కె.నాగరాజు, టియుఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నరసింహులు మాట్లాడారు. నాయకులు శివరాం, మాణిక్యం శెట్టి, లతీఫ్, సుబ్బారెడ్డి, రామ్మూర్తి, గోపాల్, షేమిమ్ బేగం,అబీబ్ బాషా, నక్కీ హరి, అశోక్,విజయ్, ఇర్ఫాన, అమత, మా దేవి, రామాంజనేయులు, నాగన్న, సుధాకర్, బాలమద్దయ్య,సునీల్ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** సుందరయ్య వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమీపంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కమిషనర్ ఎల్ రమేష్ బాబు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వ్యకాసం ఆధ్వర్యంలో, శ్రీ లక్ష్మీనరసింహ మద్దిలేటి స్వామి ముఖ ద్వారం దగ్గర రంగాపురం గ్రామ సర్పంచి గుమ్మగళ్ల రాజు, పార్టీ సభ్యులు కే రాముడు రహంతుల్లా ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ నిర్వహించారు. బేతంచర్ల సిఐటియు కార్యాలయంలో నాయకులు చల్లా మద్దిలేటి స్వామి అధ్యక్షతన సిపిఎం సీనియర్ (మిగతా వార్త 6లో..)

వాలంటీర్ల సేవలు అభినందనీయం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వాలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది చేపట్టిన 'వాలంటీర్లకు వందనం కార్యక్రమం'పై విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ప్రసారమైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, డిఎల్‌డిఒ జనార్ధన్, సంబంధిత అధికారులు, వాలంటీర్లు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి అందజేయడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించారన్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ పరిణామన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వాలంటీర్ల సేవలు వెలకట్టలేని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా వాలంటీర్లు బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు పొందిన గ్రామ, వార్డు వాలంటీర్లు 8082 మంది వున్నారన్నారు. సేవా వజ్ర నగదు పురస్కారం పొందిన 32 మందికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30 వేలు బహుమతి, సేవా రత్న నగదు పురస్కారం పొందిన 179 మందికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.20 వేలు, సేవా మిత్ర పురస్కారం పొందిన వారు 7871 మందికి సర్టిఫికేట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్ తో పాటు రూ.10 వేలు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ సేవ అందించిన కె.ప్రదీప్, పి.వసుందర, పి.శివ కుమార్, ఎస్.రబియ, రియాజ్ ఖాన్, ఎం.శ్వేత, ఎస్.మహబూబ్, ఎస్.ఖరీముల్లా, నరసింహ రెడ్డి, ఎం.అనిత, జే.భాస్కర్, గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రదానం చేశారు. సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్ర వచ్చిన వారినందరినీ అభినందిస్తున్నామని, పురస్కారం పొందడంతో మరింత బాధ్యత పెంచుతుందని కలెక్టర్ గుర్తు చేశారు.

నారా లోకేష్‌కు భారీ స్వాగతం

- బనగానపల్లి నియోజకవర్గంలోకి యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్/బనగానపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 104వ రోజు యువగళం పాదయాత్రకు బనగానపల్లి నియోజకవర్గంలో భారీగా స్వాగతం పలికారు. నంద్యాల నియోజకవర్గం రాయపాడు నుండి బనగానపల్లి మండలంలోని టంగుటూరు, అప్పలాపురం, కైప వరకు శుక్రవారం పాదయాత్ర సాగింది. మండలంలోని టంగుటూరు పెద్దమ్మ దేవస్థానం వద్ద లోకేష్‌కు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, ఆయన కుమారుడు బిసి మనోహర్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. లోకేష్ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రులు అమర్నాథ్ రెడ్డి, నక్క ఆనందబాబు, కాల్వ శ్రీనివాసులు, డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి కలిసి నడిచారు. బనగానపల్లి నియోజకవర్గం టంగుటూరులో లోకేష్‌ను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. పాదయాత్రకు బయలుదేరేముందు రాయపాడు క్యాంప్ సైట్ వద్ద ప్రముఖులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. దారిపొడవునా వివిధ రంగాల నాయకులు, కార్మికులు, ప్రజలు తమ సమస్యలను యువనేతకు చెప్పుకున్నారు. విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నామని, నిత్యావసర సరుకుల ధరలు, పెరిగిన విద్యుత్ బిల్లుల కారణంగా బ్రతకడం కష్టంగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో పన్నుల భారాన్ని, అసమర్ధ ప్రభుత్వ విధానాల గురించి ప్రజలకు వివరించారు. మరో ఏడాదిలో రాబోయే చంద్రన్న ప్రభుత్వం మీ అందరి కష్టాలు తీరుస్తుందని భరోసా ఇచ్చి యువనేత ముందుకు సాగారు. పాదయాత్ర దారిలో రైతులు, వడ్డెరలు, యాదవులు యువనేతను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. 104వ రోజు యువనేత లోకేష్ 11 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు. ఇప్పటివరకు యువగళం పాదయాత్ర 1330.1 కిలోమీటర్లు పూర్తయింది. శనివారం బనగానపల్లె పట్టణంలో యువగళం పాదయాత్ర, బహిరంగసభ నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథ రెడ్డి, మాజీ ఎంపిపి అంబాల రామకృష్ణారెడ్డి, టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటరమణ నాయక్, వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, పట్టణ ఉపసర్పంచి బురానుద్దీన్, పాతపాడు, మిట్టపల్లి సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసి రెడ్డి, నాయకులు వెంకటాపురం అమర్నాథరెడ్డి, పాతపాడు సంకేశ్వర రెడ్డి, రాయలసీమ సలాం, టిప్ టాప్ కలాం, లాయర్ నాగేంద్ర రెడ్డి, కొణిదెల పుల్లారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, పెద్దరాజుపాలెం భూషన్న, అప్పలాపురం రామాంజనేయరెడ్డి, టంగుటూరు లక్ష్మీ కాంత్ రెడ్డి, పుల్లారెడ్డి, శివ పుల్లారెడ్డి, కైప రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లోకేష్‌కు భారీగా స్వాగతం పలుకుతున్న నాయకులు, ప్రజలు



లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి



లోకేష్ వెంట బిసి జనార్దన్ రెడ్డి, ఆయన కుమారుడు బిసి మనోహర్ రెడ్డి

అడిషనల్ ఎస్‌పి రమణ బదిలీ

- ప్రమోషన్‌పై ఇంటలిజెన్సీ విభాగం డిఎస్‌పి వెంకటరమణ నియామకం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అదనపు ఎస్పీలు, డిఎస్పీల బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా అదనపు ఎస్పీ రమణ అడిషనల్ డీజీపీ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంటలిజెన్సీ విభాగంలో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న జి.వెంకట రమణకు ప్రమోషన్ కల్పిస్తూ నంద్యాల అడిషనల్ ఎస్‌పిగా బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

చుక్కల భూముల నివేదికలు ఇవ్వండి

- స్మశాన వాటికలకు స్థలాలు గుర్తించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చుక్కల భూములకు సంబంధించి 2017 యాక్ట్ ప్రకారం నివేదికలు తెప్పించుకొని సబ్ డివిజన్ చేసి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతిపాదనలు సంబంధిత ఆర్డీఓల ద్వారా సమర్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తహశీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి భూసేకరణ, పిఓఎల్ఆర్ రీ సర్వే, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, బనగానపల్లి తదితర మండలాల్లోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల కోసం స్మశాన వాటికలకు స్థలాలు గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో పెండింగులో వున్న ఫార్మ్ 6, 7, 8లకు సంబంధించి 18,212 దరఖాస్తులను విచారించి ఈ నెల 24లోగా ఓటర్ల జాబితాలో నమోదు చేయాలన్నారు. ఆళ్లగడ్డ, అవుకు సంబంధించిన పర్యాటక ప్రాంతాలు, ఇళ్ల పట్టాలకు అవసరమైన భూములు, జాతీయ రహదాలకు భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కామేశ్వరరావు, వెంకటశివ, ఆర్డీవోలు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

పాముకాటుతో ఉపాధి కూలీకి అస్వస్థత

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని పెద్ద కంబలూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరుగుతున్న ఉపాధి పనుల్లో ఓ మహిళ కూలీని పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పగిడాల సరస్వతి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు చేస్తుండగా ముళ్ల పొదల నుంచి వచ్చిన పాము కాటు వేసింది. దీంతో ఆమెను తోటి కూలీలు వెంటనే రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడవ శనివారం సందర్భంగా మండలంలోని అన్ని సబ్ స్టేషన్‌లలో మెయింటెనెన్స్, 33 కెవి లైన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున మండల విద్యుత్ వినియోగదారులు, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. **బనగానపల్లె :** మండలంలో వివిధ గ్రామాలలో, పట్టణంలో విద్యుత్ కోతలు నేడు విధించనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. 3వ శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బనగానపల్లె సబ్ స్టేషన్, పాతపాడు సబ్ స్టేషన్ పసుపుల సబ్ స్టేషన్‌లలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచెర్ల మండల పరిధిలోని పట్టణ, గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని బేతంచెర్ల మండలం ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో శంకరాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన సిసి రోడ్లు, లింకు రోడ్లు, విద్యుత్తు సరఫరా తదితర కార్యక్రమాలను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి దేవస్థానం చైర్మన్ రామచంద్రుడు, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, రామలకోట కృష్ణుడు, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మురళి కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అభివద్ధి కార్యక్రమాలను వివరిస్తున్న ఎంపిపి

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రతి మండల సమావేశంలో చర్చించిన సమస్యలు తిరిగి సమావేశం నిర్వహించే సమయానికి పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని ఆళ్లగడ్డ మండల పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిడిఒ సుబ్బారెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖకు సంబంధించి మంజూరైన ఇల్లు, కుడా కింద మంజూరైన ఇల్లు ఏ దశలో ఉన్నాయి, ఎన్ని పూర్తయ్యాయి, ప్రారంభించకపోతే అందుకు గల కారణాలను నివేదిక తయారు చేసి ఎంపిడిఒకు అందజేయాలని హౌసింగ్ ఎఇ నరసింహను ఆదేశించారు. హౌసింగ్ శాఖకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎంపిడిఒకు తెలియజేయాలన్నారు. ఎవరికీ ఈ సమాచారం ఇవ్వకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటే అభివృద్ధి ఆగిపోతుందన్నారు. తన స్థాయిలోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపుతామన్నారు. తమ పరిధి దాటిన సమస్యలను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్తమన్నారు. తహశీల్దార్ ఇంటి పట్టాలు అందజేసినప్పటికీ గృహాలు ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. ఏ స్టేజీలో బిల్లులు ఉన్నాయన్నది గ్రామ పంచాయతీ ఇంజనీరు వారికి ఇవ్వాలన్నారు. మంజూరైన ఇండ్లకు సంబంధించి ఐడి నెంబరు ఇవ్వాలన్నారు. అధికారులు, సిబ్బంది పురోగతితో మంజూరైన ఇళ్లను సకాలంలో పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకొని పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్నారు. తహశీల్దార్ హరినాథరావు రెవెన్యూ శాఖకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. ఎంపీడీవో సుబ్బారెడ్డి మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన



మాట్లాడుతున్న ఎంపిపి

సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద మంజూరయిన నిధులు వివరించారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడ నీటి ఎద్దడి లేదన్నారు. పంచాయతీరాజ్ ఏఈ కమాల్ భాష, ఎంఈఓ శోభా వివేకవతి, విద్యుత్ ఏఈ కంబగిరి, ఎపిఒ గణేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వారి వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నాసారి ప్రసాద్, దాదాపీర్, జెడ్పిటిసి లక్ష్మీదేవి, ఓబులంపల్లి సింగిల్ విండో చైర్మన్ నేట్ల రామకృష్ణారెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో జూన్ 8 నుండి 11వ తేదీ వరకు నంద్యాల రామకృష్ణ పిజి కళాశాల ఆవరణలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 ఫిడే ర్యాంకింగ్ ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీల బ్రోచర్‌ను శుక్రవారం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాలలో జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల కాలంలో నంద్యాల ప్రాంతంలో చెస్‌కు విశేష ఆదరణ రావడంలో నంద్యాల చెస్ అసోసియేషన్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెడుతుందని, నంద్యాల చెస్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ 50 వేల నగదు బహుమతులతో పాటు విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందిస్తామని, రాష్ట్రం నలుమూలల నుండి పోటీల్లో పాల్గొంటున్న వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, వివరాలకు 9010451585 నంబర్ సంప్రదించాలన్నారు. టోర్నమెంట్ చైర్మన్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల ఆవరణలో పోటీల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

రాష్ట్రంలో వైసిపి సంక్షేమ పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనతో ప్రజల జీవితాల్లో సంతోషం వెల్లువిరుస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాలలోని 15వ వార్డు గోపాల్ నగర్‌లో 107వ రోజు వార్డు కౌన్సిలర్ అనూష, వైసిపి నాయకులు సాయిరాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి నాయకులు వైసిపి సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజలకు సెంటు భూమి ఇచ్చిన పాపాన పోలేదని, టిడ్కో గృహాలను లక్షల రూపాయలకు అమ్ముకోవాలని చూశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల కోసం ఒక్క రూపాయికి టిడ్కో గృహాలను ఇచ్చామని, అలాగే నేడు మొదటి విడతలో 3006 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలను మంజూరు చేశామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే రెండో విడతలో పంపిణీ చేస్తామన్నారు. వచ్చే 2024 ఎన్నికలలో కూడా నంద్యాలలో ప్రజల ఆశీస్సులతో వైయస్సార్ జెండా ఎగరేసి తీరుతామన్నారు.. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామసుబ్బయ్య, శ్రీను, సంపత్, షాకిర్, లక్ష్మి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పా రవికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

బహిరంగ సభను విజయవంతం చేయండి : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో భాగంగా నేడు బనగానపల్లెలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కైపా విడిది కేంద్రం నుండి నారా లోకేష్ పాదయాత్రగా బనగానపల్లెకు చేరుకుంటారని, పట్టణంలోని జిఎం టాకీస్ కూడలిలో సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

అడవులను సంరక్షించడం అందరి బాధ్యత అని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం, పెద్దదేవలాపురం, సంత జూటూరు, బోధనం గ్రామాల్లో 'అడవుల సంరక్షణ మన భవిష్యత్తు' కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా ప్లాస్టిక్‌ను వినియోగించరాదన్నారు. సాంప్రదాయ ఎరువులను వాడాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఒక చెట్టును పెంచుకోవాలని కోరారు. నల్లమల్ల అడవిని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని, అడవిలోనికి ఎవరూ వెళ్లరాదని తెలిపారు. అడవులను కొట్టివేస్తే క్రూర మృగాలు గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు నష్టం చేస్తాయని, అడవులను పర్యావరణాన్ని కాపాడుకోవడం మనచేతుల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఒలు మదార్, ప్రొటెక్షన్ వాచర్లు, ప్రజలు పాల్గొన్నారు.

'మోడల్'లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్(జూనియర్ కళాశాల)లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఈనెల 22వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ చంద్రసేనారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, ఎంఇసి, సిఈసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఓసి. బిసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ. ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్ రుసుం చెల్లించాలని తెలిపారు. పదవ తరగతిలో విద్యార్థులు పొందిన మార్కుల ఆధారంగానే ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. **బనగానపల్లె :** మోడల్ స్కూల్ (జూనియర్ కళాశాల)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులను ఈనెల 22వ తేదీ నుండి జూన్ 6వ తేదీవరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామలక్ష్మి తెలిపారు.



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బండి ఆత్మకూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి పొందిన లబ్ధిని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు దే సువెంకట్రాంరెడ్డి, సర్పంచి ఎరుకలి సంధ్య, మండల ఉపాధ్యక్షురాలు ముంతల మధుర, ఎంపిటిసి సభ్యులు, తాసిల్దార్ ఉమారాణి, ఎంపీడీవో వాసుదేవ గుప్తా పాల్గొన్నారు.



డి.శ్యామల కు ప్రశంసా పత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

వాలంటీర్ల సేవలు అమోఘం

ప్రజాశక్తి-డోన్

ప్రజలకు వాలంటీర్లు చేస్తున్న సేవలు అమోఘమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన పురపాలక సంఘం మీటింగ్ హాల్ నందు వాలంటీర్ల సేవలకు సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంత గానో అభిమానించే గ్రామ,వార్డ్ వాలంటీర్ల సన్మాన సేవ కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయ మన్నారు. అనంతరం గాంధీనగర్ సచివాలయం అవార్డు గ్రహీత వాలంటీర్లకు శాలువలతో సన్మానం చేసి ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,టిపిఎస్ అంజాద్ భాష,మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండీ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు దారా హరినాథ్ రెడ్డి,పాలుట్ల మీనాక్షి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథల బోధన

ప్రజాశక్తి పగిద్యాల

గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు పగడాల గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని మాట్లాడారు. పాఠశాలను వేసవి సెలవుల్లో సమయాన్ని వృధా చేయకుండా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని పెంపొందించుకోవాలన్నారు. క్యారమ్స్, చెస్, స్కిపింగ్ మాటలు ఆడించడం జరిగిందన్నారు. అమ్మ చెప్పిన బంగారు నీతి కథలు, స్నేహం విలువ అనే కథలను విద్యార్థులతో చదివించి వాటికి అర్థం తెలియచేయడమేందన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

మహిళల క్రీడాకారులకు మద్దతుగా నంద్యాల పట్టణంలో గాంధీ చౌక్ లో మహిళ క్రీడాకారుల పై లైంగిక వేధింపుల పాల్పడిన బిజెపి ఎంపి ని తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ కొవ్వొత్తులతో నిరసన దేశవ్యాప్తంగా నిరసనలలో బాగంగా గురువారం రాత్రి జెవివి, విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు బి.రామరాజు అధ్యక్షన వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, సీనియర్ న్యాయవాది బి.శంకరయ్య, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.లక్ష్మణ్, కె.ఎం.డి.గౌస్ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి నిర్మల మాట్లాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేతలను అరెస్ట్ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరివల్ల దేశం నిర్గాంతపోతోందన్నారు. బిజ్ భూషణ్‌పై తక్షణమే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న వారిపై ఎదురుదాడి చేయడం దుర్మార్గం అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెట్రేగిపోయాయని అన్నారు. బిల్కిస్ బాను ఘటనలో పాల్పడిన వారికి క్షమాభిక్ష పెట్టి దోషులను విడుదల చేయడమే బిజెపి తీరు అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా పోరాడుతున్న మల్లయోధులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటలింగం, సబ్బారావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అవుకు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

పేదల ఇళ్లను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేదలకు ఇళ్ల ఇవ్వాలని ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటు న్నాయని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నంద్యాల నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి , ఎమ్మెల్సీ ఇసాక్ బాషా లు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా, రాజకీయాలకు, ప్రాంతాలకు, కులమతాలకు, పార్టీలకు అతీతంగా రాండమైజేషన్ విధానంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి విడతగా 3006 మందికి ఇళ్లస్థలాలు కేటాయించగా, వీరికి ఈ నెల 23న ఇళ్ల పట్టాలను అందించే ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. నంద్యాలలో స్థలాల కొరత ఉంటే మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి హయాంలో 150 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నాయకులు నేషనల్ గ్రీన్ ట్రిబునల్‌కు వెళ్లి పర్యావరణానికి ప్రమాదం అంటూ ఫీల్ వేయడం జరిగిందన్నారు. ఈ కేసును ప్రభుత్వం, అధికారులు ఎంతో కృషి చేసి గెలవడం జరిగిందని తెలిపారు. రెండవ దశలో 1209 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షా వలి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, ఎంఆర్ఓ శ్రీనివాసులు దశ్యకళల డైరెక్టర్ సునీత అమతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ రెడ్డి , బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, కౌన్సిలర్లు ,కోఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు, మీడియా ప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రాండమైజేషన్ పద్ధతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న ఎమ్మెల్యే ఇసాక్ బాషా



నాయకుల మౌనమే రాయలసీమకు అన్యాయం

- రాయలసీమ హక్కుల కోసం చలో ఢిల్లీ
- సీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

రాజకీయ నాయకుల మౌనం వహించడంతోనే రాయలసీమకు అన్యాయం జరుగుతోందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాయలసీమ నేతలపై నిప్పులు చెరిగారు. శుక్రవారం నంద్యాలలో సూరజ్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ నేతల చేతగాని తనం రాయలసీమకు శాపంగా మారిందని, తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో అప్పర్ భద్ర డ్యామ్ కడుతున్నా, సంగమేశ్వరం వద్ద తీగెల వంతెన బదులు బ్రిడ్జికం బ్యారేజ్ కోసం రాయలసీమ నాయకులు మాట్లాడకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాయలసీమకు ప్రధాన శత్రువులు రాజకీయ నాయకులు, సినీ పరిశ్రమ అన్నారు. 52 నియోజకవర్గాల్లో సేవ్ రాయలసీమ పేరుతో సంతకాల సేకరణకు అందరూ ఆదరిస్తున్నారని, లక్షమంది సంతకాలు చేసి మద్దతు తెలిపారని వివరించారు. రాయలసీమ సమస్య కోసం త్వరలో చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమ గల్లీ, గల్లీల్లో జై రాయలసీమ నినాదాలు చేస్తామని ప్రత్యేక రైళ్లలో వేలాది మంది తో త్వరలో ఢిల్లీకి ర్యాలీ చేపడతామని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. రాయలసీమ బాగుకోసం రాజకీయనాయకులు ఇప్పటికైనా గళం విప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు యం. ఎస్. నవీన్ కుమార్, యం. వి. రమణారెడ్డి, గోపాల్ యాదవ్, నందకుమార్ యాదవ్, శివ ప్రసాద్ రెడ్డి, బీమవరం రామచంద్రారెడ్డి, మునగాల తూము శివారెడ్డి, శ్రీలక్ష్మి, చెన్నమ్మ, తదితరులు పాల్గొని సంతకాల సేకరణ, కరపత్రాలు పంపిణి చేశారు.

పర్యావరణ జీవనశైలి అలవరచుకోవాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలు పర్యావరణ జీవనశైలిని అలవరచుకోవాలని రుద్రవరం రేంజ్ అధికా శ్రీపతి నాయుడు తెలియజేశారు. మండలంలోని కేపీ తండా, చింతలచెరువు, భైరవగుండాల క్షేత్రంలో ప్రజలకు పర్యావరణ జీవనశైలిపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను వాడటం మానేయాల న్నారు. ఇంధనాని నమ్మకుండా వ్యక్తి శరీర శ్రమను నమ్మాలన్నారు. నీటిని పొదుపుగా వాడితేనే భావితరాలకు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఫారెస్టర్ కిషోర్ కుమార్, ఎఫ్బీవోలు సుభాష్,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీశైలం వారి ఆదేశాలమేరకు మిషన్ లైఫ్ స్టైల్ ప్రోగ్రామును సుండిపెంటలో నిర్వహించారు. శుక్రవారం నాడు పర్యావరణహిత జీవన శైలి అను అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమములో స్కూల్ అఫ్ ఎక్సెలన్స్ విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది కె. మదనకుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీశైలం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, పి. సలాం అల్లా, యస్. భీమ్ నాయక్, పి. శ్రీరాములు, రవీంద్రనాథ్ ఠాగూర్,కొమరం భీమ్ గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం పాల్గొన్నారు. జీవనశైలి కార్యక్రమమైన, సేవ్ ఎనర్జీ , ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం కార్యక్రమాలు, వెస్టన్ కాలనిలోని మసీద్ దగ్గర, సున్నిపెంట సిఐటియు కార్యాలయం దగ్గర ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, సిఐటియు మండల సెక్రెటరీ చిన్న మారన్న, సిపిఎం మండల నాయకులు నాగ సైదయ్య, మల్లికార్జున ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ రాము, జెడ్డా నాగరాజు, చిన్నమని, తదితరులు పాల్గొన్నారు.



మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : పీడీ

ప్రజాశక్తి - పాణ్యం

మహిళలకు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డిఆర్‌డిఏ పిడి శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో మహిళా సమాఖ్య భవనం నందు మహిళలతో సమావేశం నిర్వహించారు. పిడి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనే మహిళలకు బ్యాంకుల నుండి ఋణ సదుపాయం కల్పిస్తామని అన్నారు. మండలానికి 2 5మందిని గుర్తించి వారికి బ్యాంక్ వారితో ఎం.ఓ.యు.లు కుదుర్చుకొని బ్యాంక్‌లు ఇచ్చే వ్యక్తిగత ఋణ సదుపాయంతో జీవనోపాధి పెంచుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రామా చంద్రరెడ్డి, హార్టికల్చరల్ జెడి నాగరాజు, పిషరిష్ జెడి,స్టేట్ బ్యాంక్ అర్.ఎం., స్కిల్ డెవలప్మెంట్ అథారిటీ అధికారి ప్రతాప్ రెడ్డి, ఏపిఎం ప్రసాద్ పాల్గొన్నారు.





జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మికి ఘన స్వాగతం పలికిన తాండా ప్రజలు

సిసి రోడ్లను ఏర్పాటు చేస్తాం : జడ్పిటిసి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని పిక్కిళ్లపల్లి తాండ గ్రామంలో సిసి రోడ్లు మినరల్ వాటర్ ప్లాంట్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామనిజడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి హామీ ఇచ్చారు. పిక్కిళ్లపల్లి తాండ గ్రామంలో జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి శుక్రవారం పర్యటించారు. చల్లా శ్రీలక్ష్మి తాండకు చేరుకోవడంతో తాండవవాసులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గ్రామ ప్రజలు గ్రామంలోని సమస్యలను, త్రాగునీటి సమస్యను ఆమె దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అకస్మాత్తుగా నిలిచిపోయిన దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, వైకాపా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై విచారణ

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తు పాఠశాలకు చెందిన ఐరన్ డెస్కను అక్రమంగా అమ్ముకున్న ప్రధానోపాధ్యాయుడు విక్టరీ ఇమ్మానియేల్‌ను తక్షణమే సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని సిపిఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రంగనాయుడు, మండల కార్యదర్శి వై భార్గవ్‌లు కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో శుక్రవారం విద్యాశాఖ ఉన్నత అధికారులు విచారణ చేపట్టారు. ఉపవిద్యాధికారి క్రిస్టఫర్ రంగాపురంలో పాఠశాలను సందర్శించగా.. ఫిర్యాధి ప్రతినిధిగా సిపిఐ బేతంచెర్ల మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్ యన్నా ప్రతినిధిగా హాజరై హెడ్మాస్టర్ చేసిన అవినీతిపై పూర్తిస్థాయి రిపోర్టును రాతపూర్వకంగా అందజేశారు. అనంతరం డిప్యూటీ డిఈఓ క్రిస్టోఫర్‌తో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు చేసిన నేరాన్ని అంగీకరించారు కనుక ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం, సున్నిపెంట గ్రామాల నుండి ఎవరైనా బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండి తమ వస్తువులను గమనించాలని శ్రీశైలం ప్రాజెక్టు ఎస్సై గంగయ్య యాదవ్ వివరించారు. ఈనెల 13న సుండి పెంటకు చెందిన పి.నాగజ్యోతి దోరణాల నుండి కర్నూల్ డిపోకు చెందిన శ్రీశైలం బస్సులో ప్రయాణిస్తూ శ్రీశైలం బస్టాండ్ దిగే సమయంలో రూ.31,500, ఏటీఎం కార్డును దొంగలించడం జరిగినదని ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దొంగిలించిన సొమ్మును రికవరీ చేశామన్నారు. నిందితులు వైయస్సార్ నగర్‌కు నంద్యాలకు చెందిన నగనూరి ఉషాకుమారి, రాజమండ్రికి చెందిన మరో ఇద్దరు రావుల లక్ష్మి, తొండ పోచమ్మ వేరే ముగ్గురిని లింగాల గట్టు బ్రిడ్జ వద్ద అరెస్టు చేసి ఆత్మకూరు కోర్టు నందు హాజరు పరచగా జ్యూడిషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-డోన్

ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని 30వ వార్డు కౌన్సిలర్ ఆర్ట్ రమణ పేర్కొన్నారు .శుక్రవారం 30వ వార్డులో,మన వార్డు మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా అక్షర స్కూల్ వెనుక ఒక అబ్బాయికి డెంగ్యూ జ్వరం వచ్చిందన్న సమాచారంతో వార్డులో ఉన్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ కొరకు శానిటైజర్ చెసి బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్న కౌన్సిలర్ ఆర్ట్ రమణకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వార్డులో కాలువలను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ఆర్ట్ రమణ



రజకులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

- ఎపి రజక ఎస్‌సి సాధన చైతన్య సమితి డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రాష్ట్రంలో రజకులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో జనాభా దామాషా ప్రకారం 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎపి రజక ఎస్సీ సాధన చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు నందవరం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుకు యువగళం పాదయాత్రలో రజక ఎస్సీ సాధన చైతన్య సమితి ఆధ్వర్యంలో 11 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛను, ప్రతి జిల్లాలో రజక కమ్యూనిటీ హాలును ఏర్పాటు, రజక నిరుద్యోగులకు రూ.7500 నిరుద్యోగ భృతి ఇవ్వాలని, విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ప్రభుత్వ దేవస్థానాలలో, ప్రభుత్వ ఆసుపత్రులలో ధోబీ పోస్టులను కేటాయించి, ప్రభుత్వ జీతాలు కేటాయిస్తూ వారికి ఉద్యోగులుగా అవకాశం కల్పించాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ప్రభుత్వం కేవలం రజకులను మభ్యపెట్టి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు పెద్దపీట వేశామని, 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి పదవులు ఇచ్చి ప్రత్యేక స్థానం కల్పించామని గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. రజకులపై సామాజిక బహిష్కరణలు, దాడులు, భూకబ్జాలు, హత్యలు జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక నాయకులను కట్టడి చేయకుండా ఆయన అమితానందం పొందుతున్నారే తప్ప రజకుల సంక్షేమం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటివరకు ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి రజకులు గుణపాఠం చెప్పాలని కోరారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు రజక సామాజిక వర్గం సంక్షేమంపై, ఎస్సీ జాబితా గురించి మీడియా సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. నారా లోకేష్ బాబు రజకుల సమస్యలపై టిడిపి అధికారంలోకి రాగానే ఎస్సీ జాబితాలో చేర్చేందుకు తప్పనిసరిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో రజక ఎస్సీ సాధన చైతన్య సమితి నాయకులు జూటూరు వెంకటేశ్వర్లు, డి.చిన్న, కొర్రపోలూరు నాగరాజు, డి.శ్రీనివాసులు, నీలం నాగరాజు, ఎం.వి రమణ, ఆల్వకొండ మద్దిలేటి, సి.రామమద్దిలేటి, బాల్కొండ హాల్ ఆంజనేలు, వేములపాటి నరసింహ, నందవరం మహేంద్ర పాల్గొన్నారు.

'యువగళం'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చేపట్టనున్న యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ తాలూకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని భూమా నివాసంలో ఆళ్లగడ్డ మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో లోకేష్ యువ గళం పాదయాత్ర 22, 23 తేదీలలో జరుగుతుందన్నారు. అందువల్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్దఎత్తున వచ్చి యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జెడ్పిటిసి చాంద్ భాషా, కాంట్రాక్టర్ నన్నే బాయ్ గారి జిలాని, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

(5వ పేజీ తరువాయి..) నాయకులు వై ఎల్లయ్య, వైవి వెంకటేశ్వర్లు, గుల్జార్బి నాగేంద్రమ్మ సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బేతంచెర్ల పట్టణ కార్యదర్శి వైవి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో హమాలి వర్కర్స్ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం, వ్యకాసం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి సర్పంచ్ గుమ్మగల రాజు, వ్యకాసం జిల్లా నాయకులు అర్.ఈశ్వరయ్య, పంచాయతీ ప్రెసిడెంట్ గుమ్మగాళ్ల రాజు, సీనియర్ నాయకులు ఎస్ రహమతుల్లాలు నివాళ్లు అర్పించారు. ఆర్.వెంకటలక్ష్మి, పి.వెంకటరమణ, డి.పుల్లారెడ్డి,పుష్పావతి,పి. నాగమ్మ,శివ, డి.లక్ష్మీదేవి, రాజబాబు, నరసింహారెడ్డి ఎస్ కే బాష, రహిమాన్, శేషు బాలయ్య, శ్రీనివాసులు రామచంద్రుడు నాగరాజు పుష్పావతి తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు:** సున్నిపెంట సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల నాయకులు ఎం. చిన్న మారన్న, నాగ సైదయ్య, సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.చిన్నమణి, బి వెంకటస్వామి, ప్రభాకర్, జి.మల్లికార్జున, పొలయ్య, గాలయ్య, ఆవులయ్య, మౌలాలి, మనోహర్, శ్రీనివాసులు, పెద్ద గంగులు, సిఐటియు నాయకులు చిన్న నారాయణ, రాము, జెడ్డా నాగరాజులు పాల్గొన్నారు. **పాములపాడు:** పాములపాడులో, చెలిమిల్ల, లింగాల, నాగంపల్లి గ్రామాలలో సుందరయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి సామన్న, రైతు సంఘం కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యకాసం జిల్లా నాయకులు బాలయ్య, నాయకులు ఎస్సార్ రమణ, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి సి హనుమంతు, వివిధ సంఘాల నాయకులు బాల యేసు, పురుషోత్త జయరాజు, మధు, చెన్నయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. **పాణ్యం:** మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి సిఐటియు నాయకులు నివాళుల అర్పించారు.సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, కేజే శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు బత్తిని ప్రతాప్, చంద్రబాబు, ఆటో యూనియన్ నాయకులు వెంకట్, నాగరాజు, హమాలి యూనియన్ నాయకులు బషీర్, భూపాల్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్ నందు సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు నివాళులర్పించారు. పట్టణ నాయకులు మంజుల, మీనాక్షమ్మ, ఎం.రజాక్, ఎన్.స్వాములు, డి రామ్ నాయక్, షైక్ ఇస్మాయిల్, నాయకులు ఏ. సువర్ణమ్మ, బేగం, ప్రభావతి, శాంత కుమారి, బసి రూన్, భాస్కర్ అక్కిరాజు, రవి,శివుడు, రఫీ, మియాస,గణపతి, తదితరులు పాల్గొన్నారు. **కురుకుంద గ్రామంలో** నాయకులు వై.నాగేంద్రబాబు అధ్యక్షతన నివాళ్లు అర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం నరసింహ నాయక్, నాయకులు నాగన్న, దేనుడు, వ్యకాసం నేతలు లింగస్వామి పాల్గొన్నారు. **వెలుగోడు:** పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసు రత్నం, జిల్లా కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల నాయకులు శ్రీనివాసులు మహమ్మద్ రఫీ, ఎస్ భాషా, వెంకటయ్య నివాళులర్పించారు. కృష్ణ, ఇస్మాయిల్, ఫకీరయ్య, ఆంజనేయులు, భాస్కర్, నూరుల్లా, కరిముల్లా, ఖాదర్ వలీ, కృష్ణ, చిన్న హొలీ, మహమ్మద్, సుధాకర్, లింగన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లులర్పిస్తున్న నాయకులు




డోన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిఐ శేషయ్య



బేతంచెర్లలో మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న కమిషనర్

పాణ్యంలో నివాళ్లులర్పిస్తున్న నాయకులు





ఆత్మకూరులో నివాళ్లులర్పిస్తున్న నాయకులు



వెలుగోడులో నివాళ్లులర్పిస్తున్న నాయకులు



శ్రీశైలం ప్రాజెక్టు : నివాళ్లులర్పిస్తున్న నాయకులు

పాములపాడులో నివాళ్లులర్పిస్తున్న నాయకులు

